సాక్షి నల్లగొండ

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



ముగిసిన కబడ్డీ పోటీలు

పెద్దవూర మండలం చింతపల్లిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు ముగిశాయి. - 10లో



21న అఖండజ్యోతి

బర్కత్‌పుర నుంచి బయలుదేరిన అఖండజ్యోతి ఈనెల 21న యాదాద్రికి చేరుకోనుంది. - 10లో

గరిష్టం/కనిష్టం 35°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రేపు బాధ్యతల స్వీకరణ

నల్లగొండ : రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 20వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, అన్ని క్లస్టర్ల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు పాల్గొననున్నారు.

జేఎస్‌వీలో కుళ్లిపోయిన కూరగాయలు



బయట పడేసిన కుళ్లిపోయిన కూరగాయలు

పెద్దవూర : మండల పరిధిలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం(జేఎస్‌వీ)లో భోజనం సక్రమంగా ఉండడం లేదని శనివారం మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వంటగదిలో పాచిపోయిన కూరగాయలు, బూజుపట్టిన పప్పులు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్నింటినీ బయట పడేశారు. రెండు మూడు రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని పాఠశాల సంబంధిత అధికారులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 23నుంచి 26వరకు నిర్వహించే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉత్తర తెలంగాణ జిల్లా ఇన్‌చార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీని బలోపేతం చేస్తూ యువత, మహిళలను పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం ఏ.సమీఖాద్రి, పరంగి రాము, అందె బీరయ్య, షఫి, నర్సమ్మ, జలీల్, ప్రవీణ, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా రాచకొండ ఉత్సవాలు



సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు

సంస్థాన్ నారాయణపురం : రాచకొండ పర్యాటక ఉత్సవాలు శనివారం కనుల పండువగా మొదలయ్యాయి. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో రాచకొండ ప్రాంతం మరెంతో అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆకట్టుకున్న ఫొటోగ్యాలరీ, సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాచకొండ చరిత్రను తెలిపే ఫొటో గ్యాలరీ ఆకట్టుకుంది.ఎమ్మెల్యేతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పర్యాటకులు ఫొటో గ్యాలరీని వీక్షించారు. శివపార్వతుల నాట్యం, పేరిణి నాట్యం, ఒగ్గుకళాకారుల ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, పీఏసీఎస్ చైర్మన్ జక్కడి జంగారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు, సీఐ రాజప్ప, ఎంపీడీఓ రాములు, సత్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఒగ్గు గణేష్, పల్లె గోవర్ధన్‌రెడ్డి, రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సూరపల్లి వెంకటేశం, గాలయ్య తదితరలు పాల్గొన్నారు.

జలాశయంలో జాతర

- హరిహర నామస్మరణతో మార్మోగిన సింహపురి గుట్ట
- ఏలేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు



సాగర్ జలాశయంలోని సింహపురి కొండపైన ఏలేశ్వర స్వామిని దర్శించుకుని వస్తున్న భక్తులు

నాగార్జునసాగర్ : మహా శివరాత్రి సందర్భంగా నాగార్జునసాగర్ జలాశయం మధ్యన సింహపురి కొండపై వెలసిన ఏలేశ్వరస్వామి జాతరకు శనివారం తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో సింహపురి కొండ హరిహర నామస్మరణతో మార్మోగింది. పండుగ సందర్భంగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడిపిన లాంచీలు, మరబోట్లు, పుట్టీల ద్వారా వందలాది మంది భక్తులు సింహపురి గుట్టకు చేరుకున్నారు. మెట్టదారి, మట్టి బాటలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం.. గుట్టపై ఉండడానికి స్థలం లేకపోవడంతో వలంటీర్లు భక్తులకు దైవదర్శనం చేయించి కిందికి దింపారు. అనంతరం లాంచీలను సిద్ధంగా పెట్టి వెంటవెంటనే పంపించారు. కంబాలపల్లి గ్రామానికి చెందిన వారే ఈ జాతరను నడుపుతున్నారు. ఇక్కడికి వచ్చే భక్తులకు భోజనం, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. జాతరలో హిల్‌కాలనీకి చెందిన శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ అన్నదానం చేసింది. ఏలేశ్వరం జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హిల్‌కాలనీ నుంచి వెళ్లే లాంచీలు క్రమపద్ధతిలో నడిపే విధంగా సాగర్ ఎస్‌ఐ రాంబాబు, పోలీసులు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు.



హిల్‌కాలనీలో లాంచీ దిగి వస్తున్న భక్తులు

• శంభో శంకర



పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు



నల్లగొండలో శివ లింగానికి అభిషేకం చేస్తున్న యువతులు



నల్లగొండ బీటీఎస్‌లోని శివాలయంలో ఏర్పాటు చేసిన భారీ శివలింగం

చూపు మందగింపు..!

1,99,239 మందికి కంటి పరీక్షలు

- వీరిలో 25 శాతం మందికి వక్రీభవన లోపం
- రీడింగ్ గ్లాసులు, మందులు అందజేస్తున్న సిబ్బంది
- ప్రిస్క్రిప్షన్ అద్దాలు తయారు చేయించి ఇస్తున్న వైద్య ఆరోగ్యశాఖ
- కంటి వెలుగు శిబిరాలకు నేటితో నెల రోజులు పూర్తి

సాక్షి ప్రతినిధి నల్లగొండ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జనవరి 19వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభంకాగా, ఆదివారం నాటికి నెల రోజులు అవుతోంది. ఇప్పటి వరకు 1,99,239 మందికి పరీక్షలు చేశారు. కంటి వెలుగు శిబిరాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుండగా.. అదే స్థాయిలో సిబ్బంది పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేస్తున్నారు. ముఖ్యంగా ఈ పరీక్షల్లో ఎక్కువ మంది వక్రీభవన (చూపు మందగింపు, బ్లర్, డబుల్ విజన్) లోపంతో 51,289 మంది (25.74 శాతం) బాధ పడుతున్నట్లు తేలింది. ఆ తరువాత ఎక్కువ శాతం దగ్గరి చూపు వంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని శిబిరాలకు వృద్ధులు, పేదలు పెద్ద సంఖ్యలో తరలివస్తుండడంతో జిల్లాలో ఈ కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తోంది. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వైద్య ఆరోగ్య శాఖ బృందాలను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ కార్యక్రమం పక్కాగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు.



మునుగోడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

7.90 లక్షల మందికి పరీక్షలే లక్ష్యం..

జనవరి 19వ తేదీన ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమం జూన్ 15వ తేదీ వరకు వంద రోజుల పాటు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 ఏళ్ల వయస్సు పైబడినవారు 7,90,000 మందికి కంటి పరీక్షలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిమళ్ల కొండల్‌రావు తెలిపారు. వారందరికీ పరీక్షలు నిర్వహించేందుకు 75 బృందాలను ఏర్పాటు చేశామని ఒక్కో బృందంలో 10 మంది చొప్పున సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు.

ఒక్కో శిబిరంలో రోజుకు 150 మందికి పరీక్షలు

జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాల్లో రోజుకు 150 మంది వరకు పరీక్షలకు వస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం రద్దీ అయినప్పటికీ వచ్చినవారందరికి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు..

కంటి వెలుగు ప్రారంభం నుంచి 1,99,239 మందికి పరీక్షలు చేశారు. ఇందులో మహిళలు 97,094 మంది, పురుషులు 1,02,145 మంది ఉన్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారి వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నారు. కంటి శుక్లాలు ఉన్నాయా? ఇన్‌ఫెక్షన్లు ఉన్నాయా?అనే అంశాలను పరిశీలించడంతో పాటు శుక్లాలు ఉంటే కంప్యూటరైజ్డ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మరో వైపు దగ్గరి చూపు, దూరం చూపు వంటి సమస్యలు ఉన్న వారి కోసం 51,249 అద్దాలను అందుబాటులో ఉంచారు.

ఎక్కువ మందికి దృష్టి లోపం..

జిల్లాలో ఇప్పటివరకు కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో క్యాటరాక్ట్ సమస్యతో 24,171 మంది (12.13 శాతం), కార్నియాతో 2,414 మంది (1.21శాతం), మెల్లికన్ను 669 మంది (0.33 శాతం), పేటరీజియం 13,377 మంది (6.72 శాతం), వక్రీభవన (చూపు మందగింపు, బ్లర్, డబుల్ విజన్) లోపంతో 51,289 మంది (25.74 శాతం) ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. 50 ఏళ్ల పైబడిన వారే ఎక్కువ మంది క్యాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి చికిత్స చేసే సమయాన్ని ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు 31,840 మంది (15.98 శాతం) దగ్గరి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు తేలింది. వారికి రీడింగ్ గ్లాసులను పంపిణీ చేశారు. అలాగే ప్రిస్క్రిప్షన్ అద్దాలు 20,629 మందికి అవసరం కాగా, వారికి తగిన విధంగా అద్దాలు తయారు చేసి ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 2,135 మంది అద్దాలను తయారు చేయించి అందజేశారు. 89,560 మందికి చుక్కల మందుతోపాటు విటమిన్ ఏ,డీ,బీ కాంప్లెక్స్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు.

ఫీడర్ ఛానల్ ఇంకెన్నాళ్లు..!

- 13 ఏళ్లుగా సాగుతున్న శేషిలేటివాగు కాల్వ పనులు
- రైతులకు పరిహారం ఇవ్వని అధికారులు
- కొత్తగా అంచనాలు రూపొందించేందుకు కసరత్తు



కస్తాల గ్రామ సమీపంలో శేషిలేటి వాగు కాల్వ

చండూరు : అధికారుల నిర్లక్ష్యం.. కంట్రాక్టర్ అలక్ష్యం ఫలితంగా శేషిలేటివాగు ఫీడర్ ఛానల్ పనులు అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే బీడు భూములు సాగు చేసుకుందామని రైతులు 13 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. భూ పరిహారం ఇచ్చి పనులు జరుపుకోవచ్చని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలిసిపోయారు. 13 ఏళ్ల క్రితం వేసిన అంచనాలకు ఇప్పటి ధరలకు పనులు చేయలేనని కంట్రాక్టర్ చేతులెత్తేయగా.. తిరిగి అంచాలు వేస్తే ఎంత మొత్తం అవసరమవుతోంది అని ఐబీ అధికారులను రెండు మూడు రోజులుగా ఆయా పనులను పరిశీలిస్తున్నారు. చివరకు ఆ పనులకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందా.. లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2010లో పనుల ప్రారంభం..

నాంపల్లి మండలం జాన్‌తండా నుంచి చండూరు మండలం కస్తాల మాధవరావు చెరువుకు నీరు వచ్చేలా 12 కిలోమీటర్ల వరకు ఫీడర్ ఛానల్ ఏర్పాటుకు 2010లో పనులు ప్రారంభించారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లోని గుట్టల నుంచి వచ్చే జాలుతో ఏటా వాగు పారుతూ ఆ నీరు వృథాగా పోతోంది. ఆ నీటిని ఉపయోగంలోకి తెచ్చేందుకు ఈ ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి ఆనాడు ప్రభుత్వం రూ.4.50 కోట్లు విడుదల చేసింది. అయితే రైతులకు సమయానికి పరిహారం ఇవ్వలేకపోయారు. అయినా పనులకు మొదట్లో రైతులు సహకరించారు. అప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. తర్వాత పరిహారంపై ఎలాంటి స్పందనా లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఫీడర్ ఛానల్‌కు జాన్ తండా నుంచి కస్తాల గ్రామం వరకు 52 ఎకరాలు భూమి అవసరం. అప్పట్లో ఎకరాకు రూ.4.50 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు అధికారులు రైతులతో ఒప్పందం చేసుకున్నారు. 28 ఎకరాలకు సంబంధించిన పరిహారం మంజూరైంది. కానీ రైతుల ఖాతాల్లో జమ చేయలేదు.

డబ్బులు ఇవ్వలేదు.. పనులు చేయలేదు



శేషిలేటివాగు ఫీడర్ ఛానల్ పనుల్లో నేను ఎకరం భూమి కోల్పోతున్నా. దానికి సంబంధించి నగదు జమ చేయకపోగా.. కాల్వ పనులు ముందుకు తీసుకపోలేదు. 13 ఏళ్ల క్రితం ఎకరాకు రూ.4.50 లక్షలు పరిహారం ఇస్తామన్నారు. ఆనాడే డబ్బులు ఇస్తే వేరే దగ్గర ఎకరం కొనే వాడిని. ఇప్పుడు ఆ ధర ఇస్తే మాకు వద్దు. ఇప్పటి రేటు ప్రకారం పరిహారం చెల్లించి ఫీడర్ ఛానల్ పనులు చేపట్టాలి.

– విజయ్‌పాల్‌రెడ్డి, పోచంపల్లి, గుర్రంపోడ్ మండలం

కాల్వ పనులు పరిశీలిస్తున్నాం

శేషిలేటివాగు ఫీడర్ ఛానల్ పనులను పరిశీలిస్తున్నాం. గతంలో చేసిన పనులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాల్వ పరిస్థితిని పూర్తిగా సీఈకి నివేదించాం. పైఅధికారులు మళ్లీ అంచనాలు వేయమని ఆదేశిస్తే వేస్తాం. పాత కంట్రాక్టర్ పనులు చేయనని రాత పూర్వకంగా రాసి ఇచ్చారు.

– ఖాసీం, ఐబీ డీఈ

మూడు వేల ఎకరాలు సాగులోకి..

ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే గుర్రంపోడు, చండూరు, నాంపల్లి మండలాల్లో సమారుగా 3వేల పైచిలుకు బీడు భూములు సాగులోకి రానున్నాయి. మూడు పెద్ద చెరువులు, 5 కుంటలు పూర్తిగా నిండనున్నాయి. భూగర్భ జలాలు పెరిగి సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది. ప్రస్తుతం అంచనా వ్యయం పెరగడంతో ఐబీ అధికారులు ఫీడర్ ఛానల్ పనులపై ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఇష్టకామేశ్వరస్వామి జాతరలో భాగంగా ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నక్కల రామాంజిరెడ్డి, కూతాటి దేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్టు పేరును ఆదివారం సాయంత్రంలోగా నిర్వాహకుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ రూ.20వేలు, తృతీయ రూ.15వేలు, నాలుగో రూ.12వేలు, ఐదో బహుమతి రూ.11వేలు, ఆరో బహుమతి రూ.10వేలు, ఏడో బహుమతి రూ.8వేలు, ఎనిమిదో బహుమతి రూ.7వేల నగదుతో పాటు షీల్డులను అందించనున్నట్లు తెలిపారు.

అరటి సాగుపై ఆసక్తి..



నల్లగొండ మండలం గుట్టకింది అన్నారంలో అరటి సాగు



నక్కలపల్లిలో మామిడి తోట మధ్యలో అరటి సాగు

- 80 ఎకరాల్లో సాగవుతున్న పంట
- స్థానికంగా లభిస్తున్న మార్కెట్
- అధిక దిగుబడి సాధిస్తున్న రైతులు

నల్లగొండ రూరల్ : అరటి సాగుపై జిల్లాలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా మొత్తం 80 ఎకరాల్లో 36 మంది రైతులు సాగు చేస్తున్నారు. అరటికి ఎక్కువగా డిమాండ్ ఉండడం.. స్థానికంగానే మార్కెట్ లభిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు అరటి సాగు వైపు మళ్లుతున్నారు. పండ్ల తోటల మధ్య అంతర్ పంటగా అరటి సాగు చేస్తున్నారు. అయిల్ పాం, మామిడి, బత్తాయి, సపోట, నిమ్మ తదితర తోటల మధ్య అరటి ఎక్కువగా సాగవుతోంది. అయితే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం తక్కువగా ఉండడంతో ఆర్థికంగా ఉన్న రైతులే అరటి సాగు చేస్తున్నారు.

ఎకరాకు 35 టన్నుల దిగుబడి..

ప్రస్తుతం రైతులు ఎక్కువగా టిష్యూ కల్చర్ రకం మొక్కలు నాటుతున్నారు. ఇవి ఎకరాకు 1120 మొక్కలు సరిపోతున్నాయి. అవి నాటిన ఆరు నెలల నుంచి 2–3 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఏడాదిలో 35 టన్నుల కాయలు వస్తాయి. టన్ను అరటి ధర రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. రైతుల వద్దకే వెళ్లి వ్యాపారులు గెలలను కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం తక్కువే..

అరటికి సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహం తక్కువగా ఉంటోంది. మొదటి ఏడాది రూ.12 వేలు, రెండో ఏడాది రూ.4 వేలు సబ్సిడీని ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందజేస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం తక్కువగానే ఉన్నా.. అరటి సాగు ద్వారా మంచి ఆదాయం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. అరటికి వ్యాధుల బెడద తక్కువగా ఉండడంతో రైతులకు కలిసి వస్తోందని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సాంకేతిక సలహాలు ఇస్తున్నాం



అరటి లాభదాయకమైన పంట. అరటి సాగులో మెళకువలు తెలియజేస్తూ రైతులు మంచి దిగుబడి సాధించేలా ఉద్యాన శాఖ కృషి చేస్తోంది. ప్రధానంగా రెండు వైరస్‌లు రాకుండా నివారణపై రైతులకు సూచనలు ఇచ్చి, మందులు పిచికారీ చేయిస్తున్నాం.

– సంగీతలక్ష్మి, జిల్లా ఉద్యాన, పట్టు అధికారి

స్థానికంగానే మార్కెట్ ఉంది..



నేను ఐదెకరాల్లో అరటి సాగును చేపట్టాను. స్థానికంగానే మార్కెట్ ఉంది. చాలా మంది వ్యాపారులు వ్యవసాయ క్షేత్రం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. రోజూ రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం వస్తోంది. ఆర్గానిక్ పద్ధతిలో అరటి సాగును చేపట్టి గడ్డిలో మక్కబెట్టి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం తగిన సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి. క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు ఉద్యాన సిబ్బంది ఉంటే మన్నికైన దిగుబడి, మంచి ఆదాయం లభిస్తుంది.

– సౌమ్య, గుట్టకింది అన్నారం, నల్లగొండ మండలం

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

త్రిపురారం: షార్ట్ సర్క్యూట్ జరిగి పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పడిశల నాగయ్య, రమణ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బజారులో పూరి గుడిసెలో నివాసముంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం వారు నివాసముంటున్న గుడిసెకు తాళం వేసి స్థానికంగా ఉన్న దేవాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు గుడిసెకు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు మంటలు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో విలువైన సామగ్రితో పాటు ఎల్లమ్మ పండుగ చేయడానికి దాచుకున్న రూ.60వేల నగదు, బియ్యం, వస్తువులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. నిరుపేదనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

తేనెటీగల దాడి

మునుగోడు: తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. మునుగోడు గ్రామ శివవారులోని బొడ్డు పెద్ద చంద్రమౌళిగౌడ్ తన వ్యవసాయ పొలం వద్దకు తన స్నేహితులైన గంజి నర్సింహారావు, మిఖేల్‌తో కలసి శనివారం ఉదయం వెళ్లాడు. అయితే అక్కడే ఓ చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒకసారిగా లేచి ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ క్రమంలో చంద్రమౌళిగౌడ్, నర్సింహారావు స్పృహ కోల్పోయి కింద పడిపోయారు. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన ఇద్దరినీ ఐసీయూలో ఉంచి దాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: దామరచర్ల మండలం కొండ్రపోలు శివారులో గల ఎల్–3 కెనాల్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం లభ్యమైనట్లు వాడపల్లి ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్రపోలు శివారులో ఎల్–3 కెనాల్‌లో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి వాడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడు ఎరుపు రంగు చొక్కా ధరించాడని, దానిపై ఆక్స్‌ఫర్డ్ టైలర్ కోదాడ అని ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహం 10రోజుల క్రితం నీటిలో కొట్టుకొని వచ్చి ఉండవచ్చని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9440795605, 9440795607 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.

మార్మోగిన శివనామస్మరణం



నేరేడుచర్ల: బురుగులతండా సోమప్ప ఆలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



మోత్కూరు పట్టణంలో మహాశివరాత్రి బోనాలు నిర్వహిస్తున్న మహిళలు



నార్కట్‌పల్లి: చెర్వుగట్టులో స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



నకిరేకల్‌లో పండ్లు, కూరగాయలతో శివలింగం నమూనా



పిల్లలమర్రిలోని శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



పానగల్లులో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆలేరురూరల్: కొలనుపాకలో కోటి లింగాలను దర్శించుకున్న భక్తులు



పిల్లలమర్రిలో శివుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు



వాడపల్లిలోని శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర ఆలయంలో భక్తులు

నాటుసారా స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం, మేళ్లచెర్వు మండలంలోని హేమ్లాతండాలో శనివారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు, డీటీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి సుమారు 400లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగర్జునరెడ్డి తెలిపారు. అదేవిధంగా 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ ఏలే శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకన్న, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చౌటుప్పల్: మండల పరిధిలోని ఎల్లం బావి గ్రామ శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రత్నావత్ సంతోష్(20) డిగ్రీ చదువుతున్నాడు. సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై హైదరాబాద్కు వెళ్లాడు. తిరిగి సూర్యాపేటకు వెళ్తుండగా క్రమంలో మండల పరిధిలోని ఎల్లం బావి గ్రామ శివారులోని అండర్ పాస్ దాటిన తర్వాత రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంచ నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

రైలు కింద పడి ఇద్దరు యువకులు దుర్మరణం

- పగిడిపల్లి వద్ద రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహాలు లభ్యం

బీబీనగర్: బీబీనగర్ పరిధిలోని పగిడిపల్లి వద్ద రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఇద్దరు యువకులు రైలు కింద పడి మృతిచెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చెలువాయి గ్రామానికి చెందిన నారమళ్ల నరేష్(29) ఈ నెల 15న హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి 17న ఇంటికి వెళ్తుండగా పగిడిపల్లి సమీపంలోని రైలు కింద పడి మృతిచెందాడు. అదే రోజు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం వాలేటిపాలెం గ్రామానికి చెందిన గుత్తి శ్రీధర్(26) పని నిమిత్తం హైదరాబాద్‌కు వస్తుండగా పగిడిపల్లి సమీపంలోని మరో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కింద పడి మృతిచెందాడు. శనివారం రైల్వే ట్రాక్‌పై పడి వున్న మృతదేహాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతులిద్దరూ అవివాహితులు అని, ప్రమాదవశాత్తు రైలు కింద పడి చనిపోయి ఉంటారా లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

153 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నకిరేకల్: మండలంలోని కడపర్తి శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద నిల్వ ఉంచిన 153 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. నకిరేకల్ సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కడపర్తి గ్రామానికి చెందిన యాదగిరి వ్యవసాయ బావి వద్ద షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం అర్ధరాత్రి ఎస్‌ఐ గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 153 క్వింటాళ్ల(370 బస్తాలు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి నకిరేకల్‌లోని సివిల్ సప్‌లై గోదాంకి తరలించారు. నోముల గ్రామానికి చెందిన గుండగోని చంద్రశేఖర్ ఈ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. డీటీసీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ గోపికృష్ణ తదితరులు

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

కోదాడరూరల్: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గుడిబండ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. నడిగూడెం ప్రాంతంలో ఓ రైస్ మిల్లులో పనిచేసే బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు బైక్‌పై మేళ్లచెర్వు జాతరకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో గుడిబండ శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలు కావడంతో కోదాడ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.



బైక్‌ను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లిన కారు

12మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.3,37,000 నగదు, 12 సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి శివారులో పేకాట ఆడుతున్న పన్నెండు మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోగా, వారిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు నార్కట్‌పల్లి సీఐ కె. శివరాంరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. శుక్రవారం పెద్దకాపర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పలువురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పన్నెండు మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3,37,000 నగదు, పన్నెండు సెల్‌ఫోన్‌లు, మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మిర్యాలగూడ మండలంలోని యాదగిరిపల్లికి చెందిన గునగంటి కిరణ్‌తో పాటు అయితగోని భుజంగౌడ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ ఉమర్ అలీ, తాటిచెట్టు రాఘవేందర్, గుడిపాటి శ్రీనివాస్, గంజి రవికుమార్, జిన్నే అనంతరెడ్డి, ఇమ్మడి కిరణ్‌కుమార్, కమ్మద్రి సంతోష్, పంగ గోపి, కోలా రాములు ఉన్నారు. పగిళ్ల రమేష్ అనే మరో వ్యక్తి పరారైనట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌చేసినట్లు పేర్కొన్నారు. గునగంటి కిరణ్ ఎప్పటికప్పుడు అడ్డాలను మార్చుతూ నల్లగొండతో పాటు హైదరాబాద్, చౌటుప్పల్ ప్రాంతాలకు చెందిన వారితో పేకాట ఆడిస్తుంటాడని సీఐ పేర్కొన్నారు. పట్టుబడిన వారిపై ఇప్పటికే జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ఎన్. ధర్మా పాల్గొన్నారు.



పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

చెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి

మోత్కూరు: చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ కేంద్రంలోని యాదవ కాలనీకి చెందిన బొడిగె ఎల్లయ్య (70) శనివారం ఉదయం చింతపండు తెంపడానికి స్థానిక వైజే ఫంక్షన్ హాల్ సమీపంలోని చిప్పలపల్లి యాదగిరి వ్యవసాయ బావి వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కాడు. చింతపండు తెంపుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి పడటంతో ఎల్లయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ జానకిరాంరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మదార్ (ఫైల్)

మునగాల(కోదాడ): మండల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర మదార్(52) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు స్థానిక ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చలకూర మదార్‌కు అదే గ్రామానికి చెందిన బచ్చలకూర సంజీవకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. కాగా సంజీవ ఈ నెల 16వ తేదీ రాత్రి మదార్‌పై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. దీంతో మదార్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



మహేష్ (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని వేల్పుచర్ల వద్ద సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాయామ ఉపాధ్యాయుడు(పీఈటీ) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన సైదుల మహేష్(22) కోదాడలోని గురుకుల విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం విధులు ముగించుకొని స్వగ్రామం జాజిరెడ్డిగూడేనికి బైక్‌పై వస్తుండగా వేల్పుచర్ల వద్ద హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె. కృష్ణమూర్తి తెలిపారు. మృతుడు అవివాహితుడు కాగా, అతడి తండ్రి సోమనర్సయ్య నెల రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుస్తోంది.

వేములపల్లిలో వృద్ధురాలు..



బాయమ్మ (ఫైల్)

మిర్యాలగూడ: వేములపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌పై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన బాయమ్మ(68) సరుకులు తీసుకురావడానికి కిరాణా దుకాణానికి రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాయమ్మ తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ సామియేల్ తెలిపారు.



నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్ద ఉదయం వేళ కమ్మేసిన మంచు.



మంచులో వెళ్తున్న వాహనాలు